97 జూన్ నెలలో మాస్కోలోని ప్రాచీన రాతప్రతుల పరిశోధనా భాండాగారాన్ని సందర్శించిన రాబర్ట్ వారం రోజులపాటు అక్కడే తన పరిశోధనలు చేసి, చరిత్రకి యింతవరకూ అందని సంచలన విషయాన్ని వివరించాడు ..... " అంటూ ఆగాడు డాక్టర్.

"కాని దానికీ మహదేవ్ తానే లెనిన్‌నని అనటానికీ ఏమిటి సంబంధం?" అడిగాడు అభిరాం అసహనాన్ని అణుచుకుంటూ.

"బ్రెయిన్ రైట్ హెమిస్ ఫియర్‌లో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సమాచారం స్టోర్ అయి వుంటుంది. అందులో పర్మనెంట్ స్టోరేజ్, టెంపరరీ స్టోరేజ్ అని రెండు భాగాలు వుంటాయి.

పర్మనెంట్ స్టోరేజ్‌లో తనెవరు, తన పేరేమిటి, తనేం చేస్తున్నాడు, తల్లిదండ్రులు, భార్య, ప్రియురాలు, పిల్లలు, పేర్లు, మొహాలు, ఫ్రెండ్స్ అన్నీ నమోదయి వుంటాయి. టెంపరరీ స్టోరేజ్‌లో బళ్ళు నెంబర్లు, ఇంటిలోని గదులు, ఏ రూట్ నెంబర్ బస్ ఎక్కడికెళుతుందీ వంటి సమాచారం స్టోరయి వుంటుంది.

ఏ కారణంగానో మహదేవ్ మెదడులోని వ్యక్తిగత సమాచారం స్టోరేజ్ అయి వున్న పర్మనెంట్ స్టోరేజ్ సెల్స్ ఏక్టివేట్ కాలేదు. అదే సమయంలో తానెక్కడో చదివిన లెనిన్ వ్యక్తిగత జీవితం గుర్తుకొచ్చి వుంటుంది.

అంటే టెంపరరీ స్టోరేజ్‌లో నమోదయిన విషయాలు అతని స్మృతి పథంలో మెదులుతున్నప్పుడే మీరు అతని పేరు అడిగి వుంటారు. అలా మీరు అడగగానే ఆ సెల్ ఏక్టివేట్ అయి, ఆ పేర్లు పలికాయి ..... " అతను చెప్పేది అబ్బురంగా చూస్తూ వినసాగారు అభిరాం, వరప్రసాదం.

"మానసికంగా బలహీనంగా వున్నప్పుడు కూడా, తమలో తాము మాటలాడుకోవటం, నవ్వుకోవటం, కళ్ళకు రకరకాల దృశ్యాలు కనిపించటం, తాము ఫలానా వ్యక్తులమన్న భ్రాంతికి లోనుకావటం జరుగుతుంది. మెదడులోని 'న్యూరో ట్రాన్స్‌మీటర్స్' అనే రసాయన పదార్థాలలో వచ్చే మార్పులవల్ల కూడా ఈ రకంగా ప్రవర్తిస్తారు. రోగులు దీనినే 'స్కిజోఫ్రెనియా' అంటారు ..... " చెప్పాడు డాక్టర్.

అభిరాం, వరప్రసాదం మౌనంగా వినసాగారు.

"నా అనుమానం ..... మహదేవ్ మెదడులోని ఎలక్ట్రికల్ యాక్టివిటీస్ పెర్‌ఫెక్ట్‌గా లేవని. ఆ సంగతి మీకు అప్పుడే చెప్పాను. కానీ అప్పుడు బాగానే వున్న మనిషి యిప్పుడిలా ఎందుకయ్యాడనేది అసలు ప్రశ్న" అన్నాడు డాక్టర్.

దాంతో ఏం చెప్పలేక నిస్సహాయంగా డాక్టర్ వంక చూశాడు అభిరాం.

"భయపడవలసిందేం లేదు. రేపు హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసి మరొకసారి బ్రెయిన్‌స్కానింగ్ తీయిద్దాం. లోపమేమయినా వుంటే ట్రీట్‌చేస్తే అతను మామూలుగా అయిపోతాడు" అభిరాంకి ధైర్యం చెబుతూ అన్నాడు డాక్టర్.

వరప్రసాదం కూడా ధైర్యం చెబుతున్నట్లు అభిరాం భుజం నెమ్మదిగా తట్టాడు.

"మహదేవ్ నేనే లెనిన్‌ని అనటం, ఇనీసా, కృపస్కయ పేర్లు కలవరించటం అన్నీ మెదడు ఫంక్షనింగ్‌లో కలిగిన లోపమే!

ఎక్కడో ఎప్పుడో చదివిన ఆ విషయాలని తనకి తాను అన్వయించుకుని అలా మాట్లాడాడు. భయంలేదు" అన్నాడు డాక్టర్.

కానీ అక్కడున్న ముగ్గురికీ తెలియని విశేషం ..... మహదేవ్ ఆ విషయాన్నెక్కడా చదవలేదు.

* * * * *

ఏర్‌కండిషన్ చేయబడిన ఆ గది చల్లగా, ఆహ్లాదంగా వుంది. ఓ బెడ్‌మీద మహదేవ్‌ని పడుకోబెట్టి గుండ్రంగా వున్న స్కానర్‌మెషీన్‌లోకి తల మాత్రం వెళ్ళేట్టు చేశారు.

ఓ ఇంజక్షన్ చేసి కొన్ని క్షణాల తరువాత ఓ స్విచ్చాన్ చేశారు.

మరుక్షణం బ్రెయిన్‌స్కానర్‌కున్న పెద్ద గుండ్రటి చక్రంలోని కొన్ని భాగాలు కదిలాయి. వెంటనే కంప్యూటర్ ప్రింటవుట్‌లోంచి రిపోర్ట్ వచ్చేసింది.

ఆత్రంగా చూశారు అభిరాం, వరప్రసాదం అందులో ఏముందోనని. కానీ వాళ్ళకి అర్థంకానట్లు పిచ్చిగీతల్లా వుందా రిపోర్ట్! అవి బ్రెయిన్‌లోని ఎలక్ట్రికల్ వేవ్ తాలూకు కదలికలు.

స్కానింగ్ తీయడం పూర్తయ్యాక మహదేవ్ వేరే గదికి తీసుకుపోయారు.

అభిరాం, వరప్రసాదం డాక్టర్ దగ్గరికి నడిచారు ఆ రిపోర్ట్ తీసుకుని.

ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి క్రెడిల్ చేస్తూ "కూర్చోండి" అన్నాడతను.

ఇద్దరూ కూర్చున్నారు. బ్రెయిన్‌స్కానింగ్ రిపోర్ట్ అతనికందించారు.

చాలాసేపు పరీక్షగా ఆ రిపోర్ట్‌నే చూస్తుండిపోయాడు డాక్టర్.

లోపం ఎక్కడో అర్థమై అవనట్టు అన్పించింది. 'తనకే సందిగ్ధంగా వున్నప్పుడు ఇక వాళ్ళకేం చెబుతాను' అనుకుని ఆ రిపోర్ట్‌ని మిగతా డాక్టర్లకి కూడా చూపించాలనుకుని తన డ్రాయర్లో పెట్టేశాడు.

"ఏమైనా తెలిసిందా డాక్టర్?" ఆత్రుత కన్పించింది అభిరాం మాటల్లో.

తనకి సరిగ్గా తెలియటంలేదు ..... ఏదో వుండీలేనట్టు లోపం వుందతని మెదడులో అని చెప్పలేకపోయాడతను ..... ఈగో అడ్డువచ్చి!

"ఏమీ లేదనే అనుకుందాం ప్రస్తుతం. ముందు రెండు రోజులు అతని హెల్త్ కండిషన్, మెంటల్ బిహేవియర్ పరీక్షించి చూద్దాం" అన్నాడు.

నిరాశగా లేచి నిలబడ్డాడు అభిరాం, వరప్రసాదం.

"భయపడాల్సిందేం లేదు" పాడుతున్న పాట మళ్ళీ పాడినట్టు అన్నాడతను.

అన్యమనస్కంగా బయటికి నడిచాడు అభిరాం. అతని వెనకే బయటపడ్డాడు

వరప్రసాదం.

* * * * *

మహదేవ్ తెలివిలేకుండా పడున్నాడు.

మధ్య మధ్యలో స్స్ ..... స్స్ ..... స్స్ ..... మనే శబ్దాలు అతని నోటంట రావటంతో నర్స్ భయపడిపోయింది.

సాధ్యమైనంతవరకూ మహదేవ్‌ని మత్తులోనే వుంచుతున్నారు.

మళ్ళీ సెలైన్‌లే అతని ఆహారమయ్యాయి. మనిషి డీలాపడి శరీరంలోని రక్తాన్నంతా ఎవరో తోడేసినట్టు తెల్లగా పాలిపోయింది అతని దేహం.

ఉండుండి మంచంమీద కదలసాగాడు మత్తులోనే. అభిరాం, వరప్రసాదం అతనికి దగ్గిరిలో కూర్చున్నారు. తలకీ, చేతులకీ కట్టులతో, ఎండిన పేడులా వున్నాడతను.

హఠాత్తుగా తమ వెనుకనుంచి ఎవరో నడిచివస్తున్న అడుగుల ధ్వని ..... గిర్రున అభిరాం, వరప్రసాదం ఒకేసారి వెనుదిరిగి చూశారు.

ఇద్దరి కళ్ళల్లో ఆశ్చర్యం! సన్నగా, పొడుగ్గా, తెల్లగా మెరిసిపోతున్న దేహఛాయతో, బారెడు గడ్డంతో, తెల్లని దుస్తులు టక్ చేసుకుని వున్న అపరిచితుడొకడు నిలబడి వున్నాడు.

అతని చేతిలో ఓ సూట్ కేసుంది. అతనికి ఏభైఏళ్ళు పైనే వుంటుంది వయసు.

అతని మొహంలో ఏదో తేజస్సు! వరప్రసాదానికి అతని ముఖంలోని తేజస్సుని చూడగానే తాను హిమాలయాల్లో చూసిన ఋషులు గుర్తుకొచ్చారు.

"నా పేరు తిరుపతి" గంభీరమూ, సౌమ్యమూ మిళితమైన స్వరంతో అన్నాడతను.

"కూర్చోండి" అనాలోచితంగానే అనేశాడు అభిరాం.

"మంచిది. ఈ పేషెంట్‌కి మీరేం అవుతారు?" అని అడిగాడతను.

"ఇతను నా ఫ్రెండ్. పేరు మహదేవ్. ఏక్సిడెంట్ అయితే ఎడ్మిట్ చేశాం. నా పేరు అభిరాం. వీరు మా బంధువులు వరప్రసాదంగారు."

"నేనోసారి అతన్ని చూడొచ్చా?" అభ్యర్థిస్తున్నట్లు అడిగాడతను.

"చూడండి" ఎందుకో తెలియక తెల్లబోతూ అన్నాడు అభిరాం.

మరుక్షణమే అతను కుర్చీలోంచి లేచివెళ్ళి మహదేవ్‌నే పరీక్షిస్తూ పదినిమిషాలు గడిపాడు.

అతను దగ్గరగా వెళుతున్నప్పుడు మహదేవ్ ఒక్కసారిగా కదలటం మళ్ళీ సర్దుకుపోవటం అభిరాంకీ, వరప్రసాదంకీ ఆశ్చర్యం అనిపించింది.

"ఇతనికి వైద్యం చేయించటం అనవసరం" మహదేవ్‌ని పరిశీలించటం అయినట్లు వెనక్కొచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నాడతను.

అభిరాంకి అతని మాటలు చాలా కోపాన్ని తెప్పించాయి. అంటే?" తన కోపాన్ని తెలియబరుస్తూ కరుగ్గా అడిగాడు.

“ఇతని ఆయుష్షు మరో పందొమ్మిది రోజులే”

“అలాగా? మిమ్మల్ని చూసి ఇంతవరకూ డాక్టరనుకున్నాము. జ్యోతిష్కులా?” వెటకారం, చిరాకు ప్రదర్శిస్తూ అన్నాడు అభిరాం.

“కాదు బాబూ! విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పారా సైకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను” అన్నాడతను.

“మరిక్కడికెందుకు వచ్చారు?” అడిగాడు అభిరాం.

“మా బంధువులమ్మాయి డెలివరీ అయిందిక్కడే. హైదరాబాద్‌లోనే వున్నాను కదాని చూసిపోదామని వచ్చాను. ఇంతలో నా మనస్సుకి ఏవో సంకేతాలు అంది ఇటు లాక్కొచ్చాయి .....”

అతని మాటలు అర్థంచేసుకోలేకపోయాడు అభిరాం. వరప్రసాదానికి మాత్రం అర్థమైంది. “ఇతను మామూలువాడు కాదు ..... ఇతనిలో ఏదో శక్తి దాగివుంది. దానిద్వారా మహదేవ్‌ని బతికించుకోవచ్చు” అనుకొని.

“మీరు మాట్లాడేవి మా జ్ఞానానికి అందటంలేదు. సూటిగా చెప్పండి దయచేసి” అన్నాడతనితో.

“ఇతనిమీద క్షుద్రదేవతల ప్రభావం వుంది. త్వరలోనే యితన్ని బలితీసుకోనున్నాయి.”

అతనన్న ఆ మాటలకి అభిరాం, వరప్రసాదంల గుండెలదిరాయి.

“ఎలా చెప్పగలుగుతున్నారీ విషయాన్ని?” సూటిగా ప్రశ్నించాడు అభిరాం.

“సాధారణంగా కంటికి కనిపించే పాంచ భౌతిక శరీరంకాక ప్రతి మనిషికీ మామూలు మానవులు గమనించలేని మరొక శరీరం వుంటుంది. దానిని సూక్ష్మ శరీరం అంటారు. స్థూల శరీరానికీ, సూక్ష్మ శరీరానికీ, అవినాభావ సంబంధం నిరంతరం కలిగివుంటుంది.

కర్మవశాన మానవుడు అనుభవించవలసిన మంచిగానీ, చెడుగానీ ముందు సూక్ష్మ శరీరం మీదకు వచ్చిన తరువాతే భౌతిక శరీరం మీదకు వస్తుంది.

తాంత్రికులు, ఎవరినైనా హతమార్చాలనుకుంటే ఆ మనిషి బొమ్మను చేసి ప్రాణప్రతిష్ఠ చేస్తారు. ఆ ప్రాణాకర్షణ మంత్రశక్తి వలన బొమ్మలోకి ఆ వ్యక్తియొక్క సూక్ష్మ శరీరం ఆకర్షించబడి బంధింపబడుతుంది. తాంత్రికుడు తయారుగావించిన బొమ్మ కాల్లో ముళ్ళు గుచ్చితే ఇక్కడ అసలు మనిషికి- అంటే స్థూలశరీరానికి బాధ కలుగుతుంది.

ఏ అవయవాన్నయినా మాంత్రికుడు బొమ్మకు విరిచివేస్తే మనిషి శరీరంలో ఆ భాగం చచ్చుబడిపోతుంది. గుండెలో ముళ్ళు గుచ్చటమో, తల నరకటమో బొమ్మకు చేస్తే మనిషి మరణిస్తాడు. ఇదీ తంత్ర ప్రయోగాలలోని రహస్యం. మీ స్నేహితుడి స్థూలశరీరంలో సూక్ష్మ శరీరంలేదు .....”

ఒక్కసారే పర్వతశిఖరం నుంచి అంతం తెలియని అగాథంలోకి పడుతున్న ఫీలింగ్ అభిరాంలో ..... ఆ మాటలు విన్న వరప్రసాదం మ్రాన్పడిపోయాడు.

"ఏ క్షుద్రమాంత్రికుడో ఇతనిమీద పగబట్టి చేసిన పనిది ..... " అన్నాడతను.

"ఎవరై వుంటారు?" సాలోచనగా అన్నాడు వరప్రసాదం.

"అదిమాత్రం నాకు తెలియదు ..... " అన్నాడతను.

"నాకు తెలుసు" అన్నాడు అభిరాం.

"ఎవరది?" వరప్రసాదం, తిరుపతి యిద్దరూ ఒకేసారి ఆత్రంగా అడిగారు.

"అతని పేరుకాని, ఊరుకానీ తెలియదు. ఒకసారి మేం ఇద్దరం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిని చూద్దామని వెళ్ళినపుడు మహదేవ్‌కీ, ఒక సాధువుకీ ఘర్షణ జరిగింది.

సాధారణంగా దేవుళ్ళనీ, దెయ్యాల్నీ నమ్మడు అతను. స్వామీలు, బాబాలంటే చిరాకతనికి. వ్యర్థసాధనలతో, అనవసర ఉపన్యాసాలతో మనుషుల్ని సోమరిపోతుల్లా ఏ పనీ చేయనీకుండా మూఢత్వంలోకి తోసేసేది వాళ్ళేనని అంటుండేవాడు. ఆ రోజు పరధ్యానంలో సాధువూ, మహదేవ్ ఢీకొన్నపుడు అతను ఆ సాధువుని నానామాటలూ అన్నాడు.

అప్పుడా సాధువు ఆరత్యుంగద్వారా మహదేవ్‌ని మసి చేయాలని అనుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు అప్పుడు తప్పించుకోగలిగాడు. నా అనుమానం ఇది అతని పనేనని" వివరించాడు అభిరాం.

"ఆరత్యుంగ ప్రయోగించాడా?" ఆశ్చర్యంగా అన్నాడు తిరుపతి.

"అవును!"

"నాకు తెలిసీ ఆరత్యుంగ ప్రయోగించగల వాళ్ళెవరూ ఇప్పుడు లేరు. అది వెయ్యేళ్ళ క్రితంనాడే గ్రంథాలనుంచి తొలగింపబడింది.

"ఎందుకని?"

"వందమంది ఆ విద్యని నేర్చుకుంటే వారిలో కేవలం ముగ్గురికి మాత్రమే అది అలవడుతుంది. మిగతావాళ్ళంతా గుడ్డివాళ్ళుగా మిగిలిపోవడంవరకే గనుక ..... "

అభిరాం, వరప్రసాదం ఆశ్చర్యంగా చూశారు.

"దీని కారణం వుంది. నల్లవుప్పి, జింజోరువేళ్ళు, కోలాకువున్న, బదనికగన్న, చేదిపొచ్చి, వటబొద్ది, హిమదుద్రపాకు, వరగోకి, నేల ఉసిరిక, మారేడుసొన్న మొదలైనవాటితో కషాయం తాగి, తెల్ల గురివింద, మారేడు వేరుల రసం కళ్ళలో పోసుకోవాలి.

దానివల్ల కొందరికి ఆరత్యుంగ అబ్బుతుంది. మరికొందరికి గుడ్డితనం కూడా వస్తుంది. కారణాలు మాత్రం తెలియదు. అది సాధకుడి రాత మీద ఆధారపడి వుందేమో అన్పిస్తుంది."

"హిమాలయాల్లోని ఋషులు కూడా అరత్యుంగ ప్రయోగించలేరంటారా?" వరప్రసాదం అడిగాడు.